# నిశ్శబ్ద తరంగాలు

వినోద్ స్నానం చేసి బాత్‌రూమ్‌లోంచి బయటకొచ్చి బెడ్‌రూమ్‌లో కెళ్లాడు. సంగీత వంట గదిలోంచి అతడు బెడ్‌రూమ్‌లోకి వెళ్లడం చూసింది. ఏదన్నా కావాలని పిలుస్తాడేమోనని ఒక నిమషం సేపు చెవులు రిక్కించి అతని మాట కోసం ఎదురుచూసింది. అతడు తనను పిలవకపోవడంతో తను చేస్తున్న పని మీదకు దృష్టి మళ్లించింది.

అతడు డ్రెస్సింగ్ టేబుల్ ముందు నిల్చొని నిశ్శబ్దంగా డ్రెస్ చేసుకొంటున్నాడు.

''టిఫిన్ రెడీ అయిందా, గీతా?'' అంటాడేమో ననుకొని ఆమె టిఫిన్ రెడీ అయినా ఒక నిముషం ఆలస్యం చేసింది.

ఒక ప్లేట్లో చపాతీలు, సాసర్‌లో ఆమ్లెట్ పెట్టుకొని ఆమె కూడా నిశ్శబ్దంగా డైనింగ్ టేబుల్‌మీద పెట్టేసి వెళ్లిపోయింది. అప్పుడు కూడా అతడు తలెత్తి ఆమె కేసి చూడలేదు. పేపర్ చదువుతూనే అతడు చపాతీలు తినసాగాడు. అతడు తినడం పూర్తిచేశాక ఆమె కాఫీ కప్పు తెచ్చి అతని ముందు పెట్టింది. అతడు కాఫీ తాగడం పూర్తిచేసి మరో ఐదు నిమిషాలు పేపర్ చదివి వాచీ చూసుకున్నాడు. తొమ్మిదన్నర అయింది.

అతడు లేచి బయటకొచ్చిన ఒక అయిదు నిమిషాలు స్కూటర్‌ను తుడిచి, దాన్ని పోర్టికో కిందినుండి తీసి బయటపెట్టాడు. అతడు వెళ్లేటప్పుడైనా వెళ్తున్నానని చెపుతాడో లేదో ననుకుందామె. వంట గదిలో నుంచి బయటికొచ్చి తలుపు చాటుకు నిల్చుంది.

''నేను వెళ్తున్నాను.... లంచవర్లో వస్తాను..'' గోడకు చెప్పినట్టు చెప్పి అతడు బయటి కెళ్లిపోయాడు.

ఆమె కళ్లలోంచి ఉబికి వస్తున్న కన్నీళ్లను ఆపుకోలేకపోయింది. విసురుగా తలుపులు వేసేసి బెడ్‌రూమ్‌లో కొచ్చి బెడ్‌మీద వాలి పోయి చాలాసేపు ఏడుస్తూ ఉండిపోయింది.

అతడు తనతో ఒక్క మాట కూడా మాట్లాడటం లేదు. ఎందుకు? తనంటే ఇష్టం లేదా? తనకేం తక్కువ? తను ఏ విషయంలోను తక్కువ కాదన్న విషయం ఆమెకు తెలుసు... తనను చూసిన వాళ్లెవ్వరూ వెంటనే తమ కళ్లను తనమీదనుండి మరల్చుకోలేరు... తను కాలేజీలో చదువుకునే రోజుల్లో తననందరూ ''మిస్ కాలేజీ'' అనేవాళ్లు... ఈయనగారు బాంకులో మంచి ఉద్యోగం చేస్తున్నారని నాన్న తన చదువును మధ్యలోనే ఆపించి ఈయన కిచ్చి పెళ్లి చేశారు. పెళ్లిచూపుల్లో ఈయనగారు తనను చూడగానే నచ్చిందని చెప్పేశారు...

నాన్నగారు వాళ్లడిగినంత కట్నం ఇచ్చారు... స్కూటర్ కొనిచ్చారు... ఇన్ని చేసినా అతడు తనపట్ల ముభావంగానే ఉంటున్నాడు... అంత ఇష్టం లేనప్పుడు ఆయన తననెందుకు పెళ్లి చేసుకున్నాడు?

పెళ్లయిన కొత్తలో అతడు మాట్లడకపోతే కొత్త పెళ్లికొడుకు సిగ్గు పడుతున్నాడనుకొంది. కాని ఇప్పుడు... ఈ ఇంట్లో తనూ, అతను... తప్ప ఎవరూ లేరు... ఇంకా సిగ్గేమిటి? ఈ ఇంటికి రాగానే అతడు తనను వెంటనే తన గుండెకు హత్తుకుని ఎంతో ఫ్రీగా, సరదాగా... హాయిగా తన మనస్సు విప్పి మాట్లాడతాడని కలలు కంది.

ఒక్క వంట తప్ప అన్నీ తనే చేసుకున్నాడు. ప్రతి పనినీ చాలా సిస్టమాటిగ్గా, యాంత్రికంగా చెయ్యటం అతనికి చిన్ననాటి నుండే అలవడినట్టుంది.. ప్రతిదీ....ఏది ఎక్కడ పెట్టుకోవాలో అక్కడ పెట్టుకుంటాడు. ఏ మాత్రం కూడా తొందరపడడు. ...హడావుడి చెయ్యడు. ..ఏదీ కావాలని అడగడు. ..తనే తెలుసుకుని ఇవ్వాలి. ఈ ఇంట్లో తనొక్కడే ఉన్నట్టుగా ప్రవర్తిస్తున్నాడు. తనతో బాటు మరో జీవి....తన అర్థాంగి...తన జీవిత భాగస్వామిని ఉందన్న విషయం అతడు గుర్తించినట్టు లేదు..

ఆమెకు మళ్లీ ఏడుపొచ్చింది. అంత ఇష్టం లేనివాడు తన నెందుకు చేసుకోవాలి..అంత కట్నం ఎందుకు తీసుకోవాలి..జీవితాంతం ఇలాగే ఏడిపిస్తాడా? జీవితాన్ని నరకప్రాయం చేస్తాడా?

బయట 'పోస్టు' అన్న మాట వినిపించగానే లేచి తలుపు తీసింది. పోస్టుమాన్ ఆమె చేతికొక కవరిచ్చి వెళ్లిపోయాడు..

ఉత్తరాన్ని టీపాయ్ మీద పెట్టేసి మళ్లీ వంటింట్లోకి వెళ్లింది. అన్నం, కూర వండేసి వంట గదిని శుభ్రం చేసి, బాత్‌రూమ్‌కెళ్లి స్నానం చేసి డ్రెస్ చేసుకుని టైం చూసేటప్పటికి పన్నెండున్నరయింది. ఇంకో అరగంటలో ఆయన వచ్చేస్తాడు. ఒక అరగంటలో భోజనం చేసి వెళ్లిపోతాడు.

ఒక అరగంట తర్వాత బయట స్కూటర్ చప్పుడు వినిపించటంతో ఆమె లేచి వెళ్లి తలుపు తీసింది.

''నాకేమన్నా పోస్టు వచ్చిందా?'' అన్నాడు.

''మీకేం రాలేదు'' అంది.

''నీకేమన్నా వచ్చాయా?'' అంటాడేమోననుకుంది. అతడు అలాంటి పనేమీ చేయలేదు. నిశ్శబ్దంగా భోజనం చేసి లేచాడు. ''ఇవ్వాళ సాయంత్రం నేను రావడానికి కొంచెం ఆలస్యం కావచ్చు....'' అన్నాడు. ఆమె మాట్లాడలేదు.

''వచ్చేటప్పుడు ఏమన్నా తేవాలా?'' అన్నాడు ఏదో జ్ఞాపకం వచ్చినవాడిలా.

''ఏమీ అక్కర్లేదు.'' అంది కసిగా.

''ఏమన్నా వీక్లీస్.... టాయ్‌లెట్ సామాన్లు....'' అన్నాడతను మళ్లీ.

''ఏమీ అక్కర్లేదు'' అందామె వెంటనే ఈసారింకా గట్టిగా.

''ఏమన్నా అవసరమైతే నువ్వే వెళ్లి తెచ్చుకో. ఇదుగో.. ఈ గల్లీ దాటగానే మెయిన్ రోడ్డు వస్తుంది.....'' అంటూ అతడు స్కూటర్ స్టార్టు చేశాడు..

ఆమెకు అన్నం తినాలనిపించలేదు..

ఇంట్లో ఉన్నది ఇద్దరమేగా.. ఇద్దరం కలిసే భోజనం చేద్దాం అనొచ్చుగా ! ఆ మాట అతని నోట్లోంచి వస్తుందని, ఎంతగానో ఎదురు చూసింది....

అయిదు గంటలకు పనిమనిషి వచ్చి తలుపు కొడితే లేచి తలుపు తీసింది. అంట్లన్నీ కడిగేసి ఇల్లంతా తుడిచి పనిమనిషి వెళ్లిపోయింది. గీతకు నిద్ర మత్తు వదల్లేదు. మనస్సు, శరీరం ఎంతో బరువై పోయినట్టు ఫీలయింది. ...వంట గదిలోకెళ్లి కాఫీ చేసుకుని డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని మెల్లగా సిప్ చేయసాగింది.

కాఫీ తాగినా నిద్రమత్తు వదలటం లేదు. మొహం కడుక్కుంటే బద్ధకం వదులుతుంది. కానీ మొహం కడుక్కోవాలనిపించలేదు. బెడ్‌రూమ్‌లో కెళ్లి మళ్లీ పడుకుంది. అకస్మాత్తుగా తానీ ఇంట్లో ఒంటరిదానిని. తనకు ఎవరూ లేరు. అసలీ ఇంట్లో తనెందుకు వుంది? వెంటనే లేచి సూట్‌కేసు సర్దుకుని అమ్మ, నాన్నల దగ్గరకి వెళ్లి పోవాలనిపించింది.

ఆయన ఇది వరకే ఎవర్నో ప్రేమించాడు. ఆమెను పెళ్లి చేసుకోలేకపోయాడు. ...ఎవరైతే ఏం లే అనే దృష్టితో తనను పెళ్లి చేసుకున్నాడు. తనకు ఘోరమైన అన్యాయం జరిగి పోయింది. ఇప్పుడు తననెవరూ రక్షించలేరు. ఈ విషయం నాన్నగారికి తెలుస్తే ఎంత బాధ పడతారో! ఆమెకు వెంటనే మళ్లీ దుఃఖం వచ్చేసింది. అలా ఎంతసేపు ఏడుస్తూ ఉండి పోయిందో!

బయట స్కూటర్ చప్పుడు కాగానే లేచింది. బయట వీధి లైట్లు వెలుగుతున్నాయ్. లోపలంతా చీకటి. ...వెంటనే లైటేసి తలుపు తీసింది. అతడు స్కూటరును పార్కు చేసి లోపలికొచ్చి 'డామ్‌టైర్డ్' అంటూ ఈజీ చైర్లో కూర్చున్నాడు. ఆమె నిశ్శబ్దంగా వెంటనే గదిలోకెళ్లి కాఫీ చేసి అతని చేతికిచ్చింది.

''అలా వున్నావేం? ఒంట్లో బాగాలేదా?'' అన్నాడు..

ఆమె మాట్లాడకుండా బెడ్‌రూమ్‌లోకెళ్లి కూర్చుంది. అతడు కూడా తన వెంట బెడ్ రూమ్‌లోకొచ్చి తనను దగ్గరగా తీసుకుని 'ఏమైంది గీతా ? ఎందుకలా వున్నావ్? లేట్‌గా వచ్చానని కోపమా? వెరీ సారీ.....పాపం, ఒక్కదానివే ఇంట్లో ఎంత బోర్ అయ్యావో... లే...లే... లేచి త్వరగా స్నానం చేసి .... డ్రెస్ చేసుకుని తయారు కావాలి. ఏదైనా పిక్చరుకు వెడదాం' అంటాడనుకుని ఆతని కోసం ఎదురు చూసింది. ఆమె గుండె వేగంగా కొట్టుకుంది. కానీ అతడు బెడ్‌రూమ్‌లోకి రాలేదు. కాఫీ తాగి బట్టలు మార్చుకోవడం మొదలుపెట్టాడు. తర్వాత బాత్‌రూమ్‌లోకెళ్లి స్నానం చేశాడు..

ఆమె అయిదు నిమిషాలు అతని కోసం ఎదురు చూసి వంట గదిలోకెళ్లి వంట చెయ్యటం మొదలెట్టింది.

ఎప్పుడో ఏ అర్ధరాత్రో ఆమె శరీరాన్నంతా ఎవరో నిమురుతున్నట్టు...ఎవరో తన మొహం మీద మొహం పెట్టి ముద్దాడుతున్నట్టు తోచటంతో కళ్లు తెరిచి చూసింది అతడు తన శరీరాన్ని ఆక్రమించుకోవాటానికి ప్రయత్నిస్తున్నాడు. ఆమెకు వెంటనే అతని మీద అసహ్యం వేసింది. తనతో ప్రేమగా ఒక్క మాట కూడా మాట్లాడని ఇతనికి - తనతో మరో కొత్త జీవి ఈ ఇంట్లో జీవిస్తుందన్న స్పృహ కూడా లేని ఇతనికి ....అర్ధరాత్రి తన శరీరం మాత్రం కావాలి... వెంటనే అతన్ని తన మీదనుంచి తోసెయ్యాలనిపించింది. కాని ఏదో అదృశ్యశక్తి ఆమెను అశక్తురాల్ని చేసింది.

* * *

ప్రతిరోజూ ఇలాగే.. అతనిలో ఎలాంటి మార్పు లేదు...ఆమె శోకాని కంతం లేదు.

ఆ రోజు అతడు బ్యాంక్‌కెడుతూ ''ఈ రోజు ఈవినింగ్ రావడం ఆలస్యమవుతుంది. మా కొలీగ్‌కు బెంగుళూరు ట్రాన్స్‌ఫరయింది...అతని కోసం ఈ రోజు పార్టీ ఇస్తున్నాము'' అన్నాడు. ఆమె నిశ్శబ్దంగా విని అతడు బయటకు వెళ్లగానే తలుపులు పెట్టేసుకుంది.

రాత్రి పదిగంటల వరకు ఆమె ఏదో పుస్తకం చదువుతూ గడిపింది. ...అప్పుడే నిద్రొస్తున్నట్టుగా తోచి లైటార్పేస్తుండగా బయట స్కూటర్ చప్పుడైంది. ఎప్పుడూ లేనిది అతడు తాగొచ్చినట్టు తెలియజేయడానికి రెండు సార్లు హారన్ మోగించాడు..

ఆమె వెళ్లి తలుపు తీసింది.

అతడు స్కూటరు పార్క్ చేసి లోపలికొచ్చి తనే తలుపులు పెట్టేసి ఆమె భుజాల మీద తన రెండు చేతులూ వేసి ఆమెను తన కౌగిలి లోకి తీసుకోబోయాడు. 'ఎన్నడూ లేనిది ఇతనికిదేం వికారం' అనుకుంటూ అతన్ని విదిలించుకుని లోపలికొచ్చింది.

''నో డార్లింగ్... నో.... నో.... నువ్విలా విదిలించుకున్నావంటే నేను చచ్చిపోతాను...'' అంటూ ఆమె వెంటే అతడు బెడ్‌రూమ్‌లోకొచ్చి బట్టలు మార్చుకోకుండానే ఆమె పక్కన పడుకొని ఆమెను తన వైపు తిప్పుకోబోయాడు.

''ఛీ...ఛీ... ఏమిటిది? ఇవ్వాళ మీకేమయింది... ఎందుకిలా ప్రవర్తిస్తున్నారు?'' అందామె అతన్ని తన ఒడిలోకి తీసుకుంటూ!

''నిజం గీతా! రోజురోజుకూ నేనెంత క్రుంగిపోతున్నానో నీకు తెలియదు. లోలోపల నిన్నెంతగా ఆరాధిస్తున్నానో నీకు తెలియదు. ...నీ మీద నా ఆరాధనని ఎలా తెలియజెయ్యాలో నాకు తెలియదు. నాకు మొదటి నుండి ఆడవాళ్లంటే భయం... కాలేజీలో చదువుకునే రోజుల్లో ఆడపిల్లలకెప్పుడూ చాలా దూరంగా వుంటుండేవాడిని. ...ఒకసారి మా కాలేజీలో ఎవరో రాసిన ఒక లవ్‌లెటర్ నేను రాశాననుకుని ఒక అమ్మాయి కంప్లైట్

చేస్తే, ప్రిన్సిపాల్ నన్ను వారం రోజులు సస్పెండ్ చేశారు. తర్వాత నేను నిర్దోషినని రుజువైంది. అప్పటి నుంచి ఆడపిల్లలంటే ఇంకా భయం...వాళ్ళకెపుడూ ఆమడ దూరంలో ఉండేవాడిని. ..అదే భయం నువ్వంటే కూడా ఏర్పడింది. నువ్వు కొంచెం చనువుగా ఉండి నా భయాన్ని పోగడతావనుకున్నాను...కాని నీకు నేనంటే ఇష్టం లేదు. నేను నీకు తగినవాడిని కాదు...నీ అంత అందమైన వాడిని కాదు. ...అందుకే నేనంటే అసహ్యించుకుంటున్నావు....కదూ!''

''అబ్బబ్బ...ఈ రోజు ఎందుకిలా మాట్లాడుతున్నారు?'' అందామె అతని నోరు మూస్తూ.

''ఈరోజు నిజంగానే నాకేదో అయింది, గీతా! ఈరోజు నేనేం చేశానో తెలిస్తే నువ్వు నన్నింకా అసహ్యించుకుంటావు. ....నన్నీ జన్మలో క్షమించవు. ఎంత వద్దనుకున్నా మావాళ్లు నన్ను బలవంతం చేసి ఆ పని చేయించారు.''

''ఏమిటది....ఏం చేశారు మీరు ? '' అందామె ఆశ్చర్యంగా. అప్పుడు గమనించిదామె అతని దగ్గర్నుండేదో కొత్త వాసనొస్తున్నట్టుగా.....

''నన్ను క్షమిస్తానంటేనే చెబుతాను...నువ్వు క్షమించకపోతే నేను ఒక్కరోజు కూడా బ్రతకలేను. నువ్వు నన్నెంతో అసహ్యించుకున్నా...నాతో ఒక్క మాట కూడా మాట్లాడలేకపోయినా....నాతో పిక్చర్ కెళ్లడానికి గాని, బయటికి రావడానికి గాని ఇష్టం లేకపోయినా...నేను మాత్రం నిన్ను నా ప్రాణంగా భావిస్తున్నాను....గీతా! నేను మాత్రం నిన్ను నా హృదయంలో ఎంతగా ఆరాధిస్తున్నానో... ఎంతగా పూజిస్తున్నానో ....ఎంతగా ప్రేమిస్తున్నానో....''

అతని మాటలు ఆమెకు మధురాతిమధురమైన సంగీతంలా ఉన్నాయి...బీటలు వారిపోతున్న ఆమె గుండె మీద ఆ మాటలు పన్నీటిని చిలకరిస్తున్నాయి...భయంకరమైన దాహంతో తపించిపోతున్న ఆమెకు అమృతం సేవిస్తున్నట్టుగా ఉంది...అతనెప్పుడూ అలాగే మాట్లాడుతూ ఉండిపోతే - ఈ క్షణం ఇలాగే ఘనీభవించిపోయి అనంతంగా మారిపోతే....

ఆమె అతన్ని తన శక్తినంతా కూడదీసుకుని తన గుండెకు హత్తుకుని, అతని పెదవుల్ని ముద్దుపెట్టుకుంది.

''ప్లీజ్....మీరు మరోసారి ఆ మాటనొద్దు. మీరంటే నాకు అసహ్యం లేదు. ...నా మాట నమ్మండి'' అందామె.

''కాని ...నేనీ రోజు ఏం చేశానో చెబితే తప్పకుండా అసహ్యించుకుంటావు గీతా''

''ఫరవాలేదు...చెప్పండి''

''ఈ రోజు పార్టీలో అందరితోపాటు నేనూ కొంచెం విస్కీ తాగాను''

ఆమె ఇంకా అతన్ని దగ్గరకు తీసుకుని ''ఫరవాలేదు. నేను క్షమించాల్సినంత పెద్ద

తప్పు మీరెం చెయ్యలేదు.... బాధపడకండి.... ఈ రోజు నాకు చాలా మంచి రోజు...మీ హృదయమేమిటో నాకు అర్థమైంది.''

* * *

ఆ మర్నాడు ఆమె చాలా హుషారుగా అతన్ని నిద్రలేపింది. ''చాలా పొద్దెక్కింది.... లేవండి. ఆఫీసుకు వెళ్లరా?'' అంది.

ఆ రోజు వాళ్లిద్దరూ కలిసి కాఫీ తాగి...కలిసే టిపిన్ చేశారు. ..

అతడు బయటకెడుతుంటే ....

''ఈ రోజు త్వరగా వస్తారుగా...పిక్చర్‌కెడదాం.'' అంది. కాని వెంటనే ఏదో గుర్తొచ్చిన దానిలా ''వద్దులెండి...నిన్నటిలా లేటుగానే ఏదన్నా పార్టీ అటెండ్ చేసి రండి'' అంది నవ్వుతూ. అతడూ నవ్వాడు.

''నో...నో.. ఇంక పార్టీలు లేవు, ఏం లేవు. అనుక్షణం నీ పార్టీయే ఇక'' అన్నాడతను స్కూటర్ స్టార్ట్ చేస్తూ. ★

(ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక 9-2-83)